క్లుప్తంగా

గణేశ్‌గడ్డ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఈఓ, ఆలయ అర్చకులు

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గ్రామ పంచయతీ పరిధిలోని గణేశ్‌గడ్డ సిద్ధిగణపతి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 107 రోజుల అనంతరం హుండీ లెక్కించగా రూ.22,72,404లు వచ్చిందని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవదాయ శాఖ సంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించామన్నారు. వచ్చిన ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. ఆలయంలో నిత్య అన్నదానం సాగుతుందని, అన్నదాన హుండీ ఆదాయం రూ.85,494లు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రారం సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నర్సింహా రెడ్డి, ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, సతీశ్, అయ్యప్ప, ఏఎస్ఐ మలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణ పనులు నిలిపివేయాలి



ఆర్డీఓ నాగేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): సోలక్‌పల్లిలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి సంబంధించి 774 సర్వే నెంబర్‌లోని 18 ఎకరాల భూమిలో అక్రమంగా ఈద్గా నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారని, ఆ పనులను నిలిపివేయాలని గురువారం బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచార రాష్ట్ర కో కన్వీనర్ సుభాష్‌చంద్ర, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అనంత పద్మనాభస్వామి ఆలయ భూముల్లో ఈద్గా నిర్మాణ పనులు చేపడితే ప్రభుత్వ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయమై తహసీల్దార్ దశరథ్‌కు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ద్వారకా రవి, ప్రభుగౌడ్, మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్, శేఖర్, వినోద్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

నారాయణఖేడ్: ఖేడ్ గ్రంథాలయంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బాలికలకు గ్రంథాలయ ఇన్‌చార్జి లలిత బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సింహులు, గురునాథ్, శ్రీనివాస్, నాగభూషణం, మురళీధర్ పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): గ్రంథాలయం సమస్త ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు హత్నూరలో న్యూ తేజ విద్యాలయంలో గురువారం నిర్వహించారు. విజేతలకు వారు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాసుల శ్రీనివాస్ రావు, గ్రంథాలయం ఇన్‌చార్జి స్వామి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకం అమలుకు అనుసరించాల్సిన విధి విధానాలు, అత్యవసరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ సంబంధిత అధికారులు, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండో విడత క్రింద 10,331 లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ పథకం అమలు చేయాల్సి ఉందన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, జిల్లాలో గొర్రెల పంపిణీ అమలు జరిగేలా సన్నద్ధం కావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పశు వైద్యాధికారులు తన పరిధిలోని గ్రామాలలో గొర్రెల పెంపకందారుల, సహకార సంఘ సభ్యులు, లబ్ధిదారుల సమావేశాలు ఏర్పాటు చేసి, గొర్రెల పంపిణీ అమలు విధి విధానాల గురించి అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారులు, గొర్రెల పెంపకం దారుల సహకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులతో, సంబంధిత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సమావేశం ఏర్పాటు చేసి, అన్ని విషయాలను చర్చించాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారుని వాటా ధనం ఇంకా చెల్లించని వారి నుంచి సేకరించాలని ఆదేశించారు. గొర్రెల పంపిణీ పథకం అమలుకి సంబంధించి గ్రామాల ప్రాధాన్యతా క్రమం మేరకే పథకం అమలు జరుగుతుందన్నారు. ఆ మేరకు నియోజక వర్గ ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, పశు సంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: గొల్ల, కురుమల ఆర్థిక అభ్యున్నతికి సబ్సిడీతో గొర్రెలను పంపిణీ చేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండో విడత గొర్రెల పంపిణీ అంశంపై గొర్ల కాపర్ల సహకార సంఘం మరియు పశుసంవర్థక శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ నెలాఖరులోపు రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 1509 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒక యూనిట్ ఖర్చు రూ.1,75,000లు కాగా..లబ్ధిదారుడు రూ.43,750లు చెల్లిస్తే ప్రభుత్వం మిగితా సొమ్మును సబ్సిడీగా అందిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకూ చాలా తక్కువ మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించారన్నారు. మిగిలిన సభ్యులు కూడా త్వరగా చెల్లించేలా సహకార సంఘం అధ్యక్షుడు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, వెటర్నరీ విభాగం ఏడీ అన్సారీ, ఎంపీడీవోలు, సహకార సంఘం అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: దళితుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ మండలం లింగాపూర్‌లో గురువారం ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ దళితబంధుతో దళితులకు మేలు చేకూరుతోందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసించేందుకు అంబేడ్కర్ విద్య ఉపకారవేతన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోనే 100 వరకూ అంబేడ్కర్ సామాజిక భవనాలను నిర్మించామన్నారు. జాతి గర్వించేలా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం సీఎం కేసీఆర్ ఆవిష్కరించనున్నారన్నారు. సర్పంచ్ సతీశ్, మండల రైబస అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణ, రమేశ్ చౌహాన్, అంజయ్య, లక్ష్మణ్, నర్సింహులు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దశంకరంపేట మండలం గొట్టి ముక్కలకు చెందిన సత్యమ్మకు రూ.55వేలు, రాజుకు రూ.36వేలు, ఖేడ్ మండలం అకలాయి తండాకు చెందిన తుల సీబాయికి రూ.11,500 సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): అందోల్ సహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తండ్రి రిటైర్డ్ టీచర్ కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి తల్లిని ఎమ్మెల్యే ఓదార్చారు. కృష్ణారెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.శివశేఖర్ పాల్గొన్నారు.

'బీఆర్ అంబేడ్కర్ అందరివాడు'



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్‌లో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితమైన వ్యక్తి కాదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్ మయూరి రాజుగౌడ్‌లు పాల్గొన్నారు.

బీజేపీకో హఠావో దేశ్‌కి బచావో



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): దేశంలో మోడీ సర్కార్ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా బీజేపీకో హటావో దేశ్‌కి బచావో పేరిట శుక్రవారం నుంచి మే14 వరకూ ఇంటింటికీ సీపీఐ నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ ఖాన్, రెహ్మాన్‌లు తెలిపారు. గురువారం సంగారెడ్డిలో ఇంటింటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడడమే కాకుండా, వారిపై భారాలు మోపుతుందన్నారు. ఇంటింటికీ సీపీఐ ద్వారా ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఒకే దేశం, ఒకే మతం అంటున్న బీజేపీ ఒకే కులమని ఎందుకు అనదని వారు ప్రశ్నించారు? మోడీ ప్రభుత్వం ఈ తొమ్మిది సంవత్సరాల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యురాలు బి అనురాధ, పట్టణ సహాయ కార్యదర్శి వరలత, హమీద్, కృష్ణ, భూమయ్య, శంకరయ్య, శాంతమ్మ, యాదమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



కాలనీ వాసులతో కలిసి డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. గురువారం శాంతినగర్ కాలనీ, నల్రబస్తీలో కార్పొరేటర్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌లతో కలిసి పర్యటించారు. ఓపెన్ డ్రైనేజీ ఉన్న చోట పైపులు వేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

ఓబీసీలపై ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి వీడాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్



అందోల్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌గౌడ్

జోగిపేట(అందోల్): ఓబీసీలపై నిర్లక్ష్యం వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వివక్ష చూపించడం తగదని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. 'పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమంలో భాగంగా గురువారం అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డులో మాజీ మంత్రి పి.బాబూమోహన్, జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డిలతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 23 శాతానికి కుదించి, రాజకీయంగా బీసీలను అణిచివేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను ఎత్తేసిందని, వివిధ బీసీ కులాల కార్పొరేషన్‌లకు రూ.6,100కోట్లను కేటాయించి, కేవలం రూ.494 కోట్లను మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.2,500 కోట్లను కేటాయించి, రూ.354 కోట్లను మాత్రమే విడుదల చేసిందన్నారు. కరోనా కష్టకాలంలో కులవృత్తులపై ఆధారపడిన ఏ ఒక్కరినీ కూడా ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. బీసీ గురుకులాల్లో టీచర్ల రిక్రూట్‌మెంట్ జరగలేదని, మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బీసీలపై కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుందని, కేంద్ర మంత్రి వర్గంలో 27 మంది ఓబీసీలకు స్థానం కల్పించిందని గుర్తు చేశారు. బీజేపీ సహ ఇన్‌చార్జి రామకృష్ణ, జిల్లా నాయకులు జగన్నాథం, కొత్త శ్రీనివాస్, అందోల్, చౌటకూరు, వట్‌పల్లి మండల అధ్యక్షుడు నవీన్, శేఖర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో నీలం మధు



ఇఫ్తార్ విందులో నీలం మధు

రామచంద్రాపురం(పటాన్చెరు): పట్టణంలో గురువారం రాత్రి ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, షేక్ అబ్దుల్ ఘనీ, షేక్ అబ్దుల్ గఫార్, అబ్దుల్ వాసీం, శివ పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించండి

ధర్నాలో బీజేపీ నాయకుల డిమాండ్



దీక్షలో సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి బాబూమోహన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించాలంటూ గురువారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకులు బాబూమోహన్ వారి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాలకులు అభివృద్ధి విషయంలో ఈదులనాగులపల్లిని చిన్నచూపు చూస్తున్నారన్నారు. రేడియల్ రోడ్డు నెంబర్7ను వెంటనే అందుబాటులోకి తీసుకరావలని ఆయన డిమాండ్ చేశారు. సరైన కనెక్టివిటీ రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు వాపోయారు. ఈ కార్యక్రమంలో బాలాగౌని రాంబాబు గౌడ్, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, మున్సిపల్ అధ్యక్షుడు కోటీ శంకర్‌లు ఉన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా సహా ఇన్‌చార్జ్ రామకృష్ణ, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు గడీల శ్రీకాంత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్‌లు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న సురేశ్

కొండాపూర్(సంగారెడ్డి): నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఎస్పీ, టీజెఎస్, సీపీఎం (న్యూ డెమొక్రసీ), సీపీఎంఎల్ (ప్రజాపంథా), (న్యూ డెమొక్రసీ) ఆమ్ ఆద్మీ పార్టీ, తెలంగాణ లోక్ సత్తా పార్టీ, అంబేడ్కర్ పార్టీ, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల, ఆధ్వర్యంలో నిరుద్యోగుల గోస అఖిలపక్ష భరోసా నిరసన దీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో సహాయ కార్యదర్శి గంజి హర్షిత, కోకన్వీనర్ శ్రీకాంత్, డివిజన్ నాయకులు సునీల్, సురేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న కలెక్టర్ శరత్

ఝరాసంగం(జహీరాబాద్): అంబేడ్కర్ జయంతికి సంబంధించిన కరపత్రికను కలెక్టర్ శరత్ విడుదల చేశారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు కలెక్టర్ డాక్టర్ శరత్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం. శివకుమార్‌తో కలిసి ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ కరపత్రికను విడుదల చేశారు. దత్తగిరి మహారాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

వినూత్న చిత్రాలతో అంబేడ్కర్ జయంతి శుభాకాంక్షలు



నారాయణఖేడ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు గుండు శివకుమార్ వట, అశ్వత్థపత్రాలతోపాటు తెల్లకాగితాలపై స్కెచింగ్ పద్ధతిలో వినూత్నంగా అంబేడ్కర్ చిత్రాలను గీసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం పతాక ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రాబోయే వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కోర్టు కేసు నెపంతో విద్యా రంగంలో ఉన్న అనిశ్చితిని కొనసాగించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిలు, కోశాధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి. సాయితేజ, బి. అరుణశ్రీ, సిహెచ్. కృష్ణంరాజు, ఆర్. సింహాచలం, ఎం. విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ముత్యాలమ్మ జాతరకు విరాళం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో జరగనున్న శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరకు రూ.20వేల విరాళాన్ని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధరాణి నివాసంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, యాదగిరి, అచ్చు, ముత్తు, చందు, ముత్యాలు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న అప్పలరాజుకు గురువారం టీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అప్పలరాజుకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాడనే విషయం తెలుసుకున్న టీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు టీ.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యులు రాఘవేంద్ర రెడ్డి, రాజు, బాల్‌సింగ్ పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లా సీఆర్‌పీల కమిటీ తరుపున గురువారం యశో సాయి ఆస్పత్రి బీదర్‌లో బస్వారాజ్‌ను పరామర్శించారు. వారి కుటుంబానికి వైద్యం నిమిత్తం రూ.42వేలు సాయం అందిజేశారు. ఈ కార్యక్రమములో జాక్ అధ్యక్షుడు మధురనేని శేషాద్రి, సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు, ప్రధాన కార్యదర్శి కె.రాజు, రాయికోడ్ రాజు, బస్వరాజ్ పాల్గొన్నారు.

◆ గుడిసె దగ్ధమైన కుటుంబానికి...

పటాన్‌చెరు టౌన్: సీతరామపురం కాలనీలో కోటయ్య గుడిసెలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గుడిసె తగలబడి, గ్యాస్ సిలిండర్ పేలిన విషయం తెలిసిందే. గుడిసె పూర్తిగా దగ్ధం కావడంతో కోటయ్య కుటుంబం పడుతున్న ఇబ్బందులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌కు ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు చెప్పడంతో బాధితుడు కోటయ్య కుటుంబానికి సాయంగా రూ.20వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు బాబు ముదిరాజ్, మెట్టు రాజు, మనోజ్, రమేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతీ నెలా 5లోపు వేతనాలు ఇవ్వాలి

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణలో పనిచేస్తున్న మెడికల్ ఉద్యోగులకు ప్రతీ నెల 5వ తేదీలోపు వేతనాలు జమచేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ పట్టణ అధ్యక్షురాలు మేరి ఉమా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ ఉద్యోగులకు ప్రతీ నెల 10 నుంచి 15వ తేదీ లోపు వేతనాలు రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ సమస్యను గుర్తించి 5లోపు వేతనాలు విడుదల చేయాలని కోరారు.

◆ అర్చకుడు జగదీశ్వర్ స్వామికి సన్మానం

పటాన్‌చెరు టౌన్: రుద్రారం శివారులోని శ్రీ సిద్ధి వినాయక దేవస్థానం అర్చకులు జగదీశ్వర్ స్వామికి ఉగాది పురస్కారం వచ్చిన సందర్భంగా దేవదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్, ఆలయ ఈవో మోహన్ రెడ్డి, సర్పంచ్ సుధీర్ రెడ్డి ఆలయంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంత పురుషులకు బైక్ మెకానిక్‌లో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ కలిపిస్తామని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 2 నుంచి 31వ తేదీ వరకూ ఉచిత శిక్షణ ఉంటుందని శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి, ఉచితంగా యూనిఫామ్ ఇచ్చి శిక్షణ అనంతరం సర్టిఫికేట్లు ప్రదానం చేస్తారని తెలిపారు.

◆ పనిచేసే సమయంలో జాగ్రత్తలు వహించాలి

ఝరాసంగం(జహీరాబాద్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసే సమయంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు వహించాలని ఎపిఓ రాజ్ కుమార్ సూచించారు. గురువారం ఝరాసంగంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందునా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సిహెచ్ నర్సింలు, కూలీలు పాల్గొన్నారు.

◆ ధరణి ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్న ఈ ధరణి ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కొండాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కొండాపూర్‌లో ఈ ధరణి ఆపరేటర్ ఒంటరి మహిళ పింఛన్‌కు ఆధార్ కార్డులో వయస్సు సవరిస్తానని చెప్పి రూ.10వేలు తీసుకున్నాడని ఆరోపించారు. దీనికి బాధితురాలు బంగారం అమ్మి డబ్బులు ఇచ్చానన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని బాధితులు కోరారు.

◆ సీపీఆర్‌పై శిక్షణ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎంపీపీ కార్యాలయం నందు గురువారం సీపీఆర్‌పై అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణా నిర్వహించారు. జిల్లా అధికారి నవీత్, పీహెచ్‌సీ వైద్యులు శ్వేతప్రియ తదితరులు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.

◆ సీపీఎస్ రద్దుకు ర్యాలీ

కొండాపూర్(సంగారెడ్డి): ఈ నెల 16వ తేదీన కంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దుకు నిర్వహించే ర్యాలీకి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, సుభాన్ సింగ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ తర్వాత అప్పటి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్థానంలో నూతన పెన్షన్ స్కీంను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పద్ధతితో ఉద్యోగులకు తీవ్రనష్టం కలుగుతుందన్నారు.

◆ ఇంటింటికీ బీజేపీ

జహీరాబాద్: పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని గురువారం జహీరాబాద్ పట్టణంలోని దర్శనగర్‌లో చేపట్టారు. ప్రతి ఒక్కరూ బీజేపీకి మద్దతు తెలపాలని వారు కోరారు. సుధీర్‌భండారి, పి.సుధీర్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, సురేష్‌పూరి, శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్, పాల్గొన్నారు.

◆ శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేశ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వార్డు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శ్మశాన వాటికను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికలను ఎక్కడ లేని విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. అవసరం ఉన్నచోట విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేసి హైమాస్ట్ లైట్లను బిగిస్తామన్నారు. శ్రీ సాయినగర్ కాలనీ, మల్లికార్జున్‌నగర్ కాలనీల్లో విద్యుత్‌దీపాల ఏర్పాటుకు అధికారులతో చర్చించానన్నారు. మయూరినగర్ కాలనీలో సైతం అవసరమైన చోట్ల విద్యుత్ దీపాలను, నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ విత్యుత్ శాఖ ఏఈ లిఖిత, స్థానిక నేతలు పాల్గొన్నారు.

◆ ఓబీసీలోకి వీరశైవ లింగాయత్‌లు

రాయికోడ్(అందోల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి వల్ల త్వరలోనే వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ రిజర్వేషన్ జాబితాలోకి చేర్చనున్నట్లు వీరశైవ లింగాయత్ జిల్లా సంఘం అధ్యక్షుడు మధుశేఖర్ తెలిపారు. రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ నూతన పాలక మండలి చైర్మెన్ సంగమేశ్వర్ పాటిల్, సభ్యులు మల్లప్ప, చిరంజీవి, శంకర్, వీరయ్య స్వామి, గురువారం వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాయత్‌లు సంఘటితంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే పాటిల్, సంగమేశ్వర్, జి.శివకుమార్, కేధారినాథ్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

◆ బలగం సినిమా ప్రదర్శన

ఝరాసంగం(జహీరాబాద్): మేదపల్లిలో బలగం సినిమా ప్రదర్శించారు. బుధవారం రాత్రి గ్రామస్తులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఎల్ఈడి ద్వారా సినిమాను ప్రదర్శించారు. నేటి సమాజంలో కనుమరుగవుతున్న బంధాలు, బంధుత్వాలు సినిమా ద్వారా గుర్తుకు తెచ్చుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.